సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 21 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. 8 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.2°/16.5°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం పెరిగింది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత



విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సత్య సాయి విమానాశ్రయంలో భద్రతా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 23న సత్య సాయి జయంతి సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 22న పుట్టపర్తిలో పర్యటిస్తారన్నారు. ఆ రోజు వాయుసేన విమానంలో సత్యసాయి విమానాశ్రయం చేరుకుని.. అక్కడి నుంచి ప్రశాంతి నిలయం వెళ్తారన్నారు. రోడ్డు మార్గంలో ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రపతి సభావేదిక అయిన సాయిహీరా కన్వెన్షన్ హాలు వద్ద ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ సత్యసాయి జయంత్యుత్సవాలు ముగిసే వరకూ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీలు అమ్మిరెడ్డి, రవి ప్రకాశ్, ఎస్పీలు మాధవరెడ్డి, అన్బురాజన్ తదితరులు విమానాశ్రయం, ప్రశాంతి నిలయం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలకు నో



పుట్టపర్తి టౌన్: రాష్ట్రపతి, గవర్నర్ పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో పట్టణంలో రెండు రోజులు డ్రోన్ కెమెరాల వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి నుంచి 2 కిలోమీటర్ల వరకూ ఎక్కడా డ్రోన్ ఉపయోగించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాఫిక్ మళ్లింపు..

సత్యసాయి జయంతి నేపథ్యంలో ఈ నెల 22,23న ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కొత్తచెరువు, బెంగళూరు, గోరంట్ల మీదుగా పుట్టపర్తికి వచ్చే వాహనాలు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి బ్రాహ్మణపల్లి, ఎనుములపల్లి, చిత్రావతి బైపాస్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. నల్లమాడ, బుక్కపట్నం నుంచి వచ్చే వాహనాలను కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి, సాయినగర్ మీదుగా చిన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కమ్మవారిపల్లి రోడ్డు మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు.

మౌనంగానే ఎదగమని!

వారంతా మూగ, చెవుడు, చూపు తక్కువ, పూర్తిగా కనపడని పిల్లలు. అందరితో పాటే తామూ దేనిలోనూ తీసిపోమని నిరూపించుకుంటున్నారు. ప్రభుత్వ సహకారంతో భవిత కేంద్రాల్లో ఉంటూ చక్కగా విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆ విద్యార్థులు మరింత ఉత్తమంగా ఎదిగేలా.. ఉన్నత భవితకు బాటలు వేసుకునేలా సహకారం అందించాలని వైఎస్ జగన్ సర్కారు నిర్ణయించింది. అత్యుత్తమ కంటెంట్ నిక్షిప్తం చేసిన ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టింది.

- 'ప్రత్యేక కేటగిరీ' విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- అత్యుత్తమ కంటెంట్ ఉన్న ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం
- కలెక్టరేట్‌లో లాంఛనంగా ప్రారంభం



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణల ఒరవడి కొనసాగుతోంది. విద్యార్థులకు అన్ని రకాలుగా సీఎం వైఎస్ జగన్ అండగా నిలుస్తున్నారు. పాఠశాల విద్యను ప్రోత్సహించేందుకు 'అమ్మ ఒడి' పథకం తీసుకొచ్చారు. నాణ్యమైన పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్టు, టై వంటి 9 రకాల వస్తువులు అందజేస్తున్నారు. 'నాడు–నేడు' కింద పాఠశాలలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఉన్నత చదువులు కొనసాగిస్తున్న విద్యార్థులకు 'విద్యా దీవెన', 'వసతి దీవెన' పథకాలతో చేయూతనిస్తున్నారు. విదేశాలకు వెళ్లి చదువుకుంటానంటే ఒక్కో విద్యార్థికి రూ. కోటి వరకూ ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు బైజూస్ కంటెంట్ నిక్షిప్తం చేసిన ట్యాబ్‌లు అందజేసి దేశం దృష్టిని ఆకర్షించారు. తాజాగా ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు కూడా చేయూతనిచ్చే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

అత్యాధునిక ట్యాబ్‌ల మంజూరు..

మూగ, చెవుడు, దృష్టి లోపం, పూర్తిగా కనపడని వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్య చదవాలనే ఉద్దేశంతో ఆధునిక సాంకేతికతతో కూడిన ట్యాబ్‌లు ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ట్యాబ్ రూ.29 వేలు, కీ బోర్డు రూ.8 వేల విలువ చేస్తుంది. ఆయా కేటగిరీల చిన్నారులు సులభంగా చదువుకోవడానికి వీలుగా ట్యాబ్‌కు రూపకల్పన చేశారు.

కంటెంట్ ఇలా..

6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు అనుగుణంగా ట్యాబ్‌లలో కంటెంటి నిక్షిప్తం చేశారు. బిమై ఐస్, ఎన్ విజన్ ఆల్, గూగుల్ లైవ్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ లుక్ అవుట్, డాక్స్, సీట్, జీబోర్డ్, ఫిజికల్ కీబోర్డ్, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకతలు వీటిల్లో ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చూపులేని విద్యార్థులు 55 మంది, దృష్టి లోపం విద్యార్థులు 20 మంది, వినికిడి లోపం ఉన్న 160 మంది, ఐఈ ఆర్టీలు 84 మంది, ఐఈడీఎస్ఎస్‌లు 63 మంది కలిపి మొత్తం 382 మంది ఉన్నారు. వీరందరికీ ట్యాబ్‌లు అందజేస్తారు.

మంచి పేరు తీసుకురావాలి..

చిన్నారులకు ట్యాబ్‌ల పంపిణీని సోమవారం కలెక్టర్ అరుణ్‌బాబు కలెక్టరేట్‌లో లాంఛనంగా ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ చేతన్, డీఈఓ మీనాక్షి, జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు తదితరులతో కలిసి పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, ధర్మవరంలోని భవిత కేంద్రాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంపై ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. బాగా చదువుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు.

చాలా సంతోషంగా ఉంది



ట్యాబ్‌ను కలెక్టర్ సార్ చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉంది. ట్యాబ్ చాలా బాగుంది. కొత్త కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. అందరితో పాటు మేమూ దేనిలోనూ తీసిపోమని నిరూపించుకుంటాం. ప్రభుత్వ సహకారంతో ఉన్నత విద్య అభ్యసిస్తాం.

– లిఖిత, బుక్కపట్నం విద్యార్థిని

ఏమిచ్చి రుణం తీర్చుకోగలం



ట్యాబ్‌లు అందజేసి విద్యపై మక్కువ పెంచారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. పాఠశాలల్లో పౌష్టికాహారం, శుచికరమైన భోజనాలు అందజేస్తున్నారు. మా ఆరోగ్యాలను సంరక్షిస్తున్నారు. ఏమిచ్చి ముఖ్యమంత్రి రుణం తీర్చుకోగలం.

– నవ్యశ్రీ, తలమర్ల, కొత్తచెరువు మండలం

త్వరలో ఉపాధ్యాయులకు శిక్షణ



ట్యాబ్‌లు అందరికీ పంపిణీ చేసిన వెంటనే ఐఈఆర్టీలు, ఐఈడీఎస్ఎస్‌లకు శిక్షణ ఇస్తాం. ట్యాబ్‌లోని కంటెంట్‌ను తెలియజేయడం, ఎలా విద్యార్థులకు నేర్పాలి అనే విషయాలు తెలియజేస్తాం. ప్రత్యేక అవసరాల పిల్లలను కూడా సాధారణ విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దుతాం.

– ఆనంద్‌బాబు, జిల్లా కోఆర్డినేటర్

పోలీసు 'స్పందన'కు 33 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న డీఎస్పీ వరప్రసాద్

పుట్టపర్తి టౌన్: చట్టపరిధిలో సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని 'దిశ' పోలీసుస్టేషన్ డీఎస్పీ వరప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' నిర్వహించారు. 33 అర్జీలు స్వీకరించారు. సమస్యలు విన్న అనంతరం సంబంధిత పోలీసుస్టేషన్ల అధికారులతో ఫోన్‌లో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. వీలైనంత త్వరగా న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

తాడిపత్రి టౌన్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నేషనల్ హైవే పీడీ తరుణ్ కాంట్రాక్టర్లకు సూచించారు. తాడిపత్రి పట్టణ సమీపంలోని కడప రోడ్డులో జరుగుతున్న నేషనల్ హైవే 544డీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి నాణ్యమైన మట్టి ఉపయోగించాలన్నారు. మట్టి రోడ్డు రోలింగ్ పనులు ప్రతి లేయర్‌లో పటిష్టంగా ఉండేలా చూడాలన్నారు.

అక్కనపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

మండలంలోని అక్కనపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు ఆలూరు రామేశ్వరరెడ్డి, ప్రతాప్, సూర్యముని ఎన్‌హెచ్ పీడీని కోరారు. నేషనల్ హైవే కారణంగా గ్రామానికి వెళ్లాల్సిన రహదారిని కోల్పోతున్నామని, దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. హైవే మీదుగా గ్రామానికి ట్రాక్టర్లు, బండ్లు వెళ్లేందుకు వీలుగా రోడ్డు నిర్మించాలని కోరారు. ఇందుకు పీడీ సానుకూలంగా స్పందించారు.

'స్పందన' అర్జీదారులకు సత్వర న్యాయం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'స్పందన' కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు సత్వర న్యాయం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో 'స్పందన' నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 322 మంది నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. విజ్ఞప్తులపై తక్షణమే స్పందించాలన్నారు. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారించాలని సూచించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్, ఇన్‌చార్జ్ డీపీఓ శివకుమారి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, సివిల్ సప్లయిస్ అధికారి వంశీకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- మడకశిర ప్రాంతంలోని శ్రీతులసీధామం వృద్ధాశ్రమంలో 60 మంది వృద్ధులు, దివ్యాంగులు, కంటి చూపు లేనివారు ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ఆశ్రమంలో ప్రభుత్వం తరఫున మరుగు దొడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.
- గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి సర్వే నంబర్ 65,69లోని తమ 3.06 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని గ్రామానికి చెందిన నంజప్ప కుమారుడు ఈశ్వరప్ప తెలిపారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.
- కదిరి మండలం సున్నపుగుట్ట తండాలో అనధికారికంగా ఏర్పాటు చేసిన పశువుల షెడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు మహబూబ్, చాంద్‌బాషా, ముంతాజ్, జరీనా తదితరులు వాపోయారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- కొత్తచెరువు 4వ వార్డులో నివాసముంటున్న తమకు స్థలం మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పలువురు కోరారు. సొంతిళ్లు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

తప్పించుకోలేరు!

- జిల్లాలో పెరుగుతున్న మిస్సింగ్ కేసులు
- చాకచక్యంగా ఛేదిస్తున్న పోలీసులు
- అక్కరకొస్తున్న సాంకేతికత
- రాత్రివేళ ముమ్మర గస్తీలతోనూ ఫలితం



చిన్నారి లక్షితను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ మాధవ రెడ్డి (ఫైల్)

- పుట్టపర్తిలోని మోర్ షాపింగ్ మాల్ వద్ద ఆడుకుంటున్న లక్షితశ్రీ (5)ని ఈనెల 12వ తేదీ సాయంత్రం ఓ వ్యక్తి ఎత్తుకెళ్లాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఈ విషయం పసిగట్టారు. ముమ్మర గాలింపు చేపట్టారు. భయపడిన దుండగుడు చిన్నారిని సాయిబాబా మందిరంలో వదిలి వెళ్లాడు. మరుసటి రోజే నిందితుడు సాయికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించారు.
- ఓడీ చెరువులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదివే ఇద్దరు విద్యార్థులు ఈనెల 6న అదృశ్యమయ్యారు. పాఠశాల హెచ్ఎం రామకృష్ణ ఫిర్యాదు మేరకు డీఎస్పీ వాసుదేవన్ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. బెంగళూరులో శివాజీనగరలో ఉన్నట్లు తేలింది. పోలీసులు అక్కడికి వెళ్లి పట్టుకొచ్చారు. ఈనెల 13న ఎస్పీ మాధవ్‌రెడ్డి సమక్షంలో పిల్లలను తల్లిదండ్రులకు అప్పజెప్పారు.
- కదిరి పట్టణంలోని బేరిపల్లి క్వార్టర్స్‌కు చెందిన కృష్ణమూర్తి కుమార్తె వందన ఈనెల 3న కనిపించకుండా పోయింది. కదిరి వ్యవసాయ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న వందన డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు.తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి కేసును ఛేదించారు.

సాక్షి, పుట్టపర్తి: సాంకేతికతను జిల్లా పోలీసులు సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారు. అదృశ్యం లేదా కిడ్నాప్ కేసులను సులువుగా పరిష్కరిస్తున్నారు. దుండగులను వెంటాడి మరీ పట్టుకుంటున్నారు. తప్పిపోయిన వారు ఎక్కడున్నా వదలడం లేదు. ఈ క్రమంలో సీసీటీవీ ఫుటేజీలు ప్రధాన ఆయుధాలుగా పనిచేస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా రాత్రివేళల్లో ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తూ పకడ్బందీగా వ్యవహరిస్తుండడం కూడా కలిసొస్తోంది.

కారణాలెన్నో..

అదృశ్యం లేదా కిడ్నాప్‌నకు పలు కారణాలు వెలుగు చూస్తున్నాయి. చిన్నారులను కిడ్నాప్ చేసి డబ్బు డిమాండ్ చేసి నగదు ముట్టిన తర్వాత వదిలేస్తున్నారు. మరో కోణంలో యువతులను కిడ్నాప్ చేసి అత్యాచారం చేయడంతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరికొందరు ప్రేమ వ్యవహారం కారణంగా అదృశ్యమై జంటలుగా తిరిగి వస్తున్నారు. ఇంకొన్ని చోట్ల వృద్ధాప్యంలో పోషణ భారమై సుదూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. కొందరు బుద్ధిమాంద్యం కారణంగా ప్రాంతాల వారీగా సంచరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2021 కంటే 2022లో మిస్సింగ్ కేసులు తక్కువగా నమోదయ్యాయి. 2023లో నవంబరు 20వ తేదీ నాటికే గతేడాది కంటే ఎక్కువ మిస్సింగ్ కేసులు పోలీసులు నమోదు చేశారు. అత్యధిక కేసులను ఇప్పటికే ఛేదించారు.

వదిలే ప్రసక్తే లేదు

కిడ్నాప్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నిందితులు తప్పించుకోలేరు. తల్లిదండ్రులు చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వయసుకు వచ్చిన పిల్లలపై నిఘా పెట్టాలి. బుద్ధిమాంద్యం ఉన్న వారిని బయటికి వదలరాదు. వృద్ధులకు పోషణ భారం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదే. కిడ్నాప్ కేసులను తప్పక ఛేదిస్తాం.

– ఎస్వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ



విద్యుద్దీప కాంతులతో వెలుగులీనుతున్న వినాయక ఆలయం



శోభాయమానంగా యజుర్ మందిరం



ప్రత్యేక అలంకరణలో ఉత్తర గోపురం ప్రవేశ ద్వారం

వర్ణశోభితం.. సాయి మందిరం

ప్రశాంతి నిలయం: సత్యసాయి 98వ జయంత్యుత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వేలాది భక్తులతో పుట్టపర్తి పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. వేడుకలను పురస్కరించుకుని స్థానికంగా ఉన్న ఆలయాలను విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. రంగురంగుల కాంతుల నడుమ ఆలయాలు కొత్త శోభ సంతరించుకున్నాయి. ప్రశాంతి నిలయం తూర్పు ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక తోరణాలు ఆకట్టుకుంటున్నాయి.



నూతన శోభ సంతరించుకున్న సాయికుల్వంత్ సభా మందిరం

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: అయ్యప్ప మాలధారుల కోసం అనంతపురం జిల్లా మీదుగా కేరళలోని శబరిమలకు సికింద్రాబాద్–కొల్లాం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు ప్రతి శుక్రవారం సికింద్రాబాద్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు రైలు (07127) బయలుదేరి శనివారం రాత్రి 7.30 గంటలకు కొల్లం చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి ఈ రైలు (07128) కొల్లం జంక్షన్ నుంచి శనివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందని తెలిపారు. ఫస్ట్ క్లాస్ ఏసీ, టూటైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్‌తోపాటు సెకండ్ క్లాస్ జనరల్ బోగీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయ్యప్ప స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొండచిలువను చంపిన గ్రామస్తులు

పుట్లూరు: గ్రామస్తుల చేతిలో కొండచిలువ హతమైంది. మండలంలోని గరుగుచింతలపల్లి సమీపంలో సోమవారం ఏడు అడుగుల పొడవున్న కొండచిలువ గ్రామస్తులకు కనిపించింది. అప్పటికే కుందేలును చంపి మింగుతోంది. ఇది గ్రామంలోకి ప్రవేశిస్తే ప్రమాదమని భావించిన గ్రామస్తులు కొండ చిలువను కొట్టి చంపేశారు.

క్లుప్తంగా

'108'లో ప్రసవం


నవజాత శిశువును అందజేస్తున్న ఈఎంటీ చిత్తయ్య

అమరాపురం: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు... అమరాపురం మండలం హాలుకూరుకు చెందిన నిండు గర్భిణి మమతకు సోమవారం ఉదయం పురిటి నొప్పులు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని ఆమెను ఆస్పత్రికి చేర్చేందుకు సిద్ధమయ్యారు. మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన 108 సిబ్బంది ఆపి ఆమెకు కాన్పు చేశారు. పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు 108 అంబులెన్స్ ఈఎంటీ చిత్తయ్య, పైలెట్ శివకుమార్‌ను అభినందించారు.

గుర్తు తెలియని యువకుడి దుర్మరణం



పెనుకొండ: వాహనం ఢీకొని ఓ గుర్తుతెలియని యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పెనుకొండ సమీపంలోని ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించారు. మృతుడిని తమిళనాడుకు చెందిన వాడిగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైతు పంట పండింది

- 'పురం' మార్కెట్‌కు తరలి వస్తున్న ఎర్ర బంగారం
- ధరల్లో గుంటూరు మార్కెట్‌తో పోటీ
- క్వింటా గరిష్ట ధర రూ.26 వేలు

హిందూపురం అర్బన్: ఎండు మిర్చి ధరలో దూసుకుపోతోంది. జిల్లాలోని హిందూపురం మార్కెట్ యార్డుకు ఈ ఏడాది పెద్ద ఎత్తున మిర్చి దిగుబడులను రైతులు తీసుకొస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ధరలూ క్రమంగా పెరుగుతుండడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఏటా పది వేల నుంచి 18 వేల క్వింటాళ్ల వరకూ మిర్చి లావాదేవీలను హిందూపురం మార్కెట్ యార్డులో కొనసాగిస్తుండడం గమనార్హం.

'ఈ–నామ్'తో పెరుగుతున్న ధరలు

ప్రస్తుతం ఎండు మిర్చి ధర ఆశాజనకంగా ఉండడంతో పొరుగున్న ఉన్న కర్ణాటక ప్రాంత రైతులతో పాటు ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల నుంచి రైతులు పంట దిగుబడులు తీసుకు వస్తున్నారు. వారంలో ప్రతి శుక్ర, మంగళ వారాల్లో మిర్చి వ్యాపారులు, రైతులతో మార్కెట్ యార్డు కిటకిటలాడుతోంది. ఈ క్రమంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ–నామ్ విధానాన్ని యార్డు అధికారులు అమలు చేస్తుండడంతో ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే కింటా గరిష్టంగా రూ.26 వేలకు చేరుకోవడం గమనార్హం. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకూ మార్కెట్ యార్డు ద్వారా మిర్చి దిగుబడులను రైతులు తీసుకువస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ మార్కెట్ యార్డుకు 7,573 క్వింటాళ్ల మిర్చి వచ్చింది.


మార్కెట్ యార్డులో రాసులుగా పోసిన ఎండు మిర్చి

డిసెంబర్ చివరి నాటికి మరో 6 నుంచి 7 క్వింటాళ్లు వచ్చే అవకాశమున్నట్లు అధికారుల అంచనా. గత రెండేళ్లతో పోల్చుకుంటే ఈ సారి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మిర్చి సాగు విస్తీర్ణం తగ్గినట్లుగా రైతులు పేర్కొంటున్నారు.

గుంటూరు మిర్చితో పోటీ..

ఆసియాలోనే మిర్చికి అతి పెద్ద మార్కెట్‌గా ఖ్యాతి గాంచిన గుంటూరు యార్డు ధరలతో హిందూపురం మార్కెట్ యార్డు పోటీ పడుతోంది. గత శుక్రవారం గుంటూరు మార్కెట్‌లో మిర్చి క్వింటా కనిష్టంగా రూ.11 వేలు, గరిష్టంగా రూ.23,700తో అమ్ముడు పోగా... హిందూపురం మార్కెట్ యార్డులో క్వింటా కనిష్టం రూ.7,200 నుంచి గరిష్టంగా రూ.26 వేలతో అమ్ముడు పోయింది. సగటున రూ.11,800తో క్రయ విక్రయాలు సాగాయి.

ఈ మూడేళ్లలో హిందూపురం మార్కెట్ యార్డుకు వచ్చిన మిర్చి (క్వింటాళ్లలో)

సంవత్సరం	మార్కెట్‌కు వచ్చిన సరుకు	మొత్తం విలువ	మార్కెట్ ఫీజు
2021–22	18,661	రూ.1350.45 లక్షలు	రూ.13.50 లక్షలు
2022–23	8,376	రూ.1186.49 లక్షలు	రూ.11.86 లక్షలు
2023–24	7,573	రూ.947.24 లక్షలు	రూ.9.47 లక్షలు

(ఈ నెల 16 తేదీ నాటికి)

ధరలు బాగున్నాయి

ఈ సారి వర్షం లేక పోవడంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు కానీ, మార్కెట్‌లో మిర్చి ధరలు బాగున్నాయి. ఇప్పటి వరకూ పంటకు ధర గిట్టుబాటుగానే ఉంటోంది. రాబోయే రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది.

– ప్రకాష్, మిర్చి రైతు, చౌళూరు

మిర్చి నాణ్యత బాగుంది

ఇప్పటి వరకూ మార్కెట్ యార్డుకు వచ్చిన మిర్చి నాణ్యత చాలా బాగుంది. ఈ–నామ్ విధానంతో క్రయవిక్రయాలు చేపట్టాం. దీంతో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గత శుక్రవారం క్వింటా గరిష్టంగా రూ.26వేలతో అమ్ముడు పోయింది. గుంటూరు మార్కెట్‌తో పోల్చుకుంటే ఇక్కడే ధరలు బాగున్నాయి.

– వీఎస్ కిషోర్‌కుమార్, మార్కెట్ యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి, హిందూపురం

రైతులకు గిట్టుబాటు ధర

గుంటూరు మార్కెట్‌తో పోల్చుకుంటే ఇక్కడ ధర రైతులకు గిట్టుబాటుగానే ఉంటోంది. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులో మిర్చికి డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో ఇక్కడి నుంచి ఆయా ప్రాంతాలకు ఎగుమతులు పెరిగాయి. రాబోవు రోజుల్లోనూ ఇవే ధరలు కొసాగుతాయని అనుకుంటున్నా.

– ఆదినారాయణ, మిర్చి వ్యాపారి, హిందూపురం

జనవాక్కు

ప్రభుత్వ బడులకు మహర్దశ



మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ బడులకు మహర్దశ చేకూరింది. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్ ఆశయానికి అనుగుణంగా ఉపాధ్యాయుల్లోనూ మార్పు వచ్చింది. గతంలో ఉదాసీనంగా వ్యవహరించిన వారందరూ ప్రస్తుతం చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్నారు. అక్షరాస్యతలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపే బాధ్యత మాదేనని అందరమూ భావించి ఆ దిశగా అడుగేస్తున్నాం. ఇక యాప్‌ల నిర్వహణ అంటారా... కొత్తలో కాస్త ఇబ్బంది పడినా తర్వాత దానిని బాధ్యతగా గుర్తించాం.

– డి.శ్రీనివాసరెడ్డి, టీచర్, బాబాసాహెబ్‌పల్లి, ఓడీచెరువు మండలం

పేదలకు వరం



జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దనే వైద్య సేవలు అందించడం పేదలకు వరంలా మారింది. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు దాదాపు ఏడెనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళుతుండేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వం మా ఊళ్లోనే వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులూ అందజేస్తోంది. నా వరకూ కంటి చూపు సక్రమంగా లేక ఇబ్బంది పడుతుండేదాన్ని. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు పరీక్షించి, మందులతో పాటు కంటి అద్దాలూ ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు చూపు బాగా కనిపిస్తోంది. ఇలాంటి సేవలు గతంలో ఎన్నడూ చూడలేదు. సీఎం జగన్ సేవలు జీవితంలో మర్చిపోలేం.

– లక్ష్మమ్మ, బీజీ హళ్లి గ్రామం, రొళ్ల మండలం

ఇంటి యజమానినయ్యా



సొంతిళ్లు లేక ఏళ్లుగా ఇబ్బంది పడ్డా. నా భర్త విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. దివ్యాంగురాలైన నేను ఎప్పటికైనా సొంతిల్లు కట్టుకోవాలని అనుకున్నా. అయితే ఏళ్లుగా ఇది కలగానే ఉండిపోయింది. సీఎం జగన్ చలువతో జగనన్న కాలనీలో నాకు ఇంటి పట్టా వచ్చింది. నిర్మాణ పనులు పూర్తయి గృహ ప్రవేశం కూడా చేశా. నా కల నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను.

– ఆశ, దేమకేతేపల్లి, హిందూపురం

సొంతింటి కల నెరవేరింది



జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మా కష్టాలు ఒక్కొక్కటిగా దూరమవుతూ వచ్చాయి. సొంతింటి కల సాకారమైంది. నిర్మాణ బిల్లులు ఎప్పటికప్పుడు ఖాతాల్లోకి జమ అవుతున్నాయి. త్వరలో సొంతింట్లోకి చేరబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. మా కష్టాలు తీర్చిన దేవుడు సీఎం వైఎస్ జగన్. ఆయన కలకాలం చల్లగా ఉండాలి.

– మారెక్క తురకలాపట్నం, రొద్దం మండలం

కమనీయం... సాయి గానామృతం


సంగీత విభావరి నిర్వహిస్తున్న రాజేష్ వైద్య బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి 98వ జయంతి వేడుకల్లో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు రాజేష్ వైద్య సోమవారం సాయంత్రం నిర్వహించిన సాయి గానామృతం సంగీత విభావరి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. దాదాపు గంట పాటు సాయికుల్వంత్ సభా మందిరం భక్తిగీతాలాపనతో మార్మోగింది. అనంతరం సత్యసాయి మహాసమాధిని గాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించి, చిత్రపటం అందజేశారు.

నేడు సత్యసాయి జయంతి

మంగళవారం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి జయంతిని వేడుకగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ప్రముఖ సంగీత విద్వాంసుడు శివశ్రీ స్కంద ప్రసాద్ బృందం సంగీత కచేరి ఉంటుంది.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి


వీడ్కోలు సమావేశంలో క్రీడాకారులతో హెచ్‌ఎంలు, తదితరులు

నల్లమాడ: జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఏపీ జట్టును గెలిపించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి బేస్ బ్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపికైన క్రీడాకారులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 10 రోజుల పాటు శిక్షణకు హాజరయ్యారు. బేస్‌బాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి నరసింహనాయక్, కోచ్‌లు అంకన్న, నవీన్ శిక్షణ ఇచ్చారు. సోమవారం పంజాబ్‌కు బయలుదేరి వెళ్లారు. క్రీడాకారులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల హెచ్‌ఎం భాస్కరరెడ్డి, ఎస్టీ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సతీష్, సీనియర్ క్రీడాకారుడు పఠాన్ గౌస్‌బాషా మాట్లాడారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నారు.

లారీ కింద పడి యువకుడి మృతి

రాయదుర్గం: వేగంగా దూసుకొచ్చిన లారీ కిందపడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని రాయచూరుజిల్లా జాలహళ్లికి చెందిన నాగరాజు (28) బెంగళూరులో బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనిపై సోమవారం స్వగ్రామానికి లారీలో బయలుదేరాడు. డి.హీరేహాళ్ పోలీసు స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే స్పీడ్ బ్రేకర్ వద్ద దిగాడు. అప్పటికే ఫుల్‌గా మద్యం మత్తులో ఉన్న నాగరాజు... బళ్లారి వైపుగా వెళ్లే లారీని ఆపి ఎక్కేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో వేగంగా దూసుకొచ్చిన లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

- బంగారు, వెండి వస్తువులతో పాటు నగదు అపహరణ


చెల్లాచెదురుగా పడి ఉన్న బీరువాలోని వస్తువులు


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ జరిగింది. అర కిలో బంగారు, రెండున్నర కిలోల వెండి వస్తువులతో పాటు నగదు అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. విశ్రాంత అసిస్టెంట్ ట్రెజరీ అధికారి రామభూషణరాజు గుంతకల్లులోని కసాపురం రోడ్డు సమీపంలో ఉన్న అంజలీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారుల్లో ఓ కుమారుడు, కోడలు పుట్టపర్తిలో ఉంటున్నారు. మరో కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. మనవరాలిని చూసుకునేందుకని రెండు వారాల కిందట రామభూషణరాజు భార్య పుట్టపర్తికి వెళ్లింది. అప్పటి నుంచి విశ్రాంత ఉద్యోగి ఒకరే ఇంట్లో ఉండేవారు. వారం క్రితం ఆయన కూడా పుట్టపర్తికి వెళ్లారు. పని మనిషి మాత్రం రెండు రోజులకోసారి వచ్చి పక్కింటి వారి వద్ద నుంచి తాళం చెవి తీసుకుని గేటు తీసి.. కాంపౌండ్ పరిసరాలు శుభ్రం చేసి వెళ్లేది. రోజుల తరబడి ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పథకం వేశారు. గ్రిల్ తలుపునకు ఉన్న తాళం పగులగొట్టి, ఆ తరువాత చెక్క తలుపు తాళం కొండీని విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి అందినకాడికి ఎత్తుకుపోయారు. సోమవారం ఉదయం శుభ్రం చేసేందుకు పనిమనిషి వచ్చింది. అయితే అప్పటికే ఇంటి తలుపు తీసి తెరిచి ఉండటంతో వెంటనే పక్కింటి వారికి, ఇంటి యజమానికి సమాచారమందించింది. పుట్టపర్తి నుంచి రామభూషణరాజు హుటాహుటిన బయల్దేరి గుంతకల్లుకు చేరుకున్నారు. ఇంట్లోకెళ్లి చూడగా రెండు బెడ్‌రూముల్లోని బీరువాలు, అల్మారాల్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటం చూసి చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, కసాపురం ఎస్‌ఐ గోపాలుడు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 55 తులాల బంగారంతోపాటు 2.5 కిలోల వెండి వస్తువులు, రూ.62 వేల నగదు చోరీ అయినట్లు బాధితుడు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతపురం నుంచి వచ్చిన క్లూస్ టీమ్ సభ్యులు ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు భాను

చిలమత్తూరు: మండల కేంద్రంలో నివాసముంటున్న వివాహిత భాను(40) సోమవారం సాయంత్రం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ గంగాధర్ పేర్కొన్నారు.

ఐడీబీఐలో అగ్ని ప్రమాదం

అనంతపురం క్రైం: నగరంలోని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) శ్రీకంఠం సర్కిల్ శాఖలో సోమవారం ఉదయం 9 గంటలకు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బ్యాంక్ నుంచి దట్టమైన పొగలు వస్తుండడం గమనించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. కొన్ని ఫైళ్లతో పాటు ఫర్నీచర్, కంప్యూటర్లు కాలి బూడిదయ్యాయన్నారు. ఖాతాదారులకు సంబంధించిన ఫైళ్లు, నగదు, తాకట్టులో ఉన్న బంగారు నగలకు ఎలాంటి ప్రమాదం లేదని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. మరో రెండు రోజుల్లో సేవలు పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటకలో అదృశ్యం.. అనంతలో ప్రత్యక్షం

- హోం వర్క్ చేయలేదని ఉపాధ్యాయుడి చేతిలో దెబ్బలు
- భయంతో రాయచూరులో రైలెక్కిన ఆరో తరగతి విద్యార్థి
- క్షేమంగా కుటుంబసభ్యులకు అప్పగింత


బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, తదితరులు

అనంతపురం సిటీ: హోం వర్క్ చేయకపోవడంతో ఉపాధ్యాయుడు దండిస్తూ చెయ్యి చేసుకోవడంతో భయపడిన ఓ విద్యార్థి బెంగళూరుకు వెళ్లే రైలు ఎక్కాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే అప్రమత్తమై అనంతపురంలో బాలుడిని అదుపులోకి తీసుకుని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి ఎదుట హాజరుపరిచారు. వివరాలు... కర్ణాటకలోని రాయచూరు జిల్లా దేవదుర్గకు చెందిన నూర్జహాన్ బేగం, హబీబ్‌బాషా దంపతుల కుమారుడు సౌకత్ అలీ... అదే ఊళ్లోని హాస్టల్‌లో ఉంటూ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. హోం వర్క్ చేయకపోవడంతో ఆదివారం ఉపాధ్యాయుడు గట్టిగా మందలిస్తూ కొట్టాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలుడు పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. విషయాన్ని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే సమాచారం అందించడంతో అన్ని పోలీస్ స్టేషన్లతో పాటు రైల్వే పోలీసులనూ అక్కడి పోలీసులు అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న అనంతపురం ఆర్పీఎఫ్ ఎస్‌ఐ మధుసూదనాచారి, జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది సోమవారం రాయచూరు నుంచి వస్తున్న రైళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మిషన్ వాత్సల్య విభాగం డీసీపీఓ వెంకటేశ్వరి, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమాచారి, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సోషల్ వర్కర్ నాగలక్ష్మి కూడా రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఆరా తీశారు. ఇంతలో సాయంత్రం అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న బెంగళూరుకు వెళ్లే రైలుతో బాలుడిని గుర్తించి, స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడి చిన్నాన్న నవాబ్‌జాన్‌ను పిలిపించి మాట్లాడారు. అనంతరం సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి ఎదుట బాలుడిని హాజరుపరిచి కుటుంబసభ్యులకు అప్పగించారు.